క్లుప్తంగా

సీఎంపీఎఫ్ జమ చేయాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేసి పదవి విరమణ చేసిన కార్మికులకు చెల్లించాల్సిన సీఎంపీఎఫ్, పీఎల్ఆర్ డబ్బులను తక్షణమే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని హెచ్ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షురాలు కొడిపల్లి శ్రీలత సింగరేణి యాజమాన్యాన్ని బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీఫ్ డబ్బులను 6వ తేదీలోగా చెల్లిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు వారి ఖాతాల్లో జమ చేయలేదన్నారు. యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకోవాలని, వారి ఖాతాల్లో నగదు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు బి.కుమారస్వామి, అజార్ ఖాన్, సతీష్, కనకయ్య, విజయకుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

భద్రాచలం: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో పట్టణంలోని యాదవ సంఘ నాయకులను భద్రాచలం పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. కాగా, ఈ ఘటనను యాదవ సంఘ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జెట్టి రామకృష్ణ, కాటిబోయిన ఆనంద్‌లు ఖండించారు. తమ న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. అరెస్టైన వారిలో సంఘం ఉపాధ్యక్షుడు నక్క సాయిరాం, నాయకులు అజయ్, ఉపేంద్ర, గొనె సుధాకర్, నక్కా సతీష్, ఆవుల శివ, రాచురి దైవ ప్రసాద్, చిట్టి, చిన్ని, మద్దిబోయిన రమేష్, లల్లూ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా మోహన్

అశ్వారావుపేట: బీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా అశ్వారావుపేటకు చెందిన మోటూరి మోహన్ నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావులు నియామక పత్రాన్ని బుధవారం హైదరాబాదులో అందజేశారు.

'కమ్యూనిస్టు యోధుడు మంచికంటి'

చండ్రుగొండ: దివంగత ఖమ్మం మాజీ ఎమ్మెల్యే మంచికంటి రాంకిషన్‌రావు కమ్యూనిస్టు యోధుడని సీపీఎం నాయకులు కొనియాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం రాంకిషన్‌రావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటం ఎదుట జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఐలూరి రామిరెడ్డి, రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, బత్తుల నాగేశ్వరరావుల, రాము, రబ్బాని, తిరుపతయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాకా రామలక్ష్మయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా.. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు ఆయన భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీటీసీ సోడెం మహాలక్ష్మి, సర్పంచ్‌లు కాకా అనూష, వంకా ముత్యాలరావు, బీఆర్ఎస్ నాయకులు గంగరాజు, భరత్, అబ్దుల్‌జిన్నా, తోలెం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీలోని కార్మికుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఇఫ్టూ నేత ఆర్.మధుసూదన్‌రెడ్డి, సామాజిక కార్యకర్త కర్నే రవిలు డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా మణుగూరు మున్సిపాలిటీలో సమ్మెకు దిగిన కార్మికులను వారు బుధవారం కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం పెరిగిన వేతనాలు అమలు చేయాలని, ఏరియర్స్ చెల్లించాలని కోరారు. లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రాజేందర్, బత్తుల వెంకటేశ్వర్లు, పల్లపు నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, పద్మ, పి.నర్సింహారావు, రమాదేవి, దుర్గయ్య, చంద్రయ్య, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

చండ్రుగొండ: బీఆర్ఎస్ నాయకుడు సారేపల్లి శేఖర్ భార్య సారేపల్లి నాగశిరోమణి(59) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా, హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతదేహాన్ని చండ్రుగొండకు తీసుకురాగా పలువురు నివాళులర్పించి శేఖర్ కుటుంబీకులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఎంపీపీ బానోత్ పార్వతితో పాటు వివిధ పార్టీల నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, జారే ఆదినారాయణ, భోజ్యానాయక్, చెవుల చందర్‌రావు, దార వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'కోనసీమ'లో పంటలెండుతున్నాయి..

- ఇష్టారీతిన అప్రకటిత విద్యుత్ కోతలు
- ఆటోస్టార్టర్ల తొలగింపు
- పడిగాపులు కాస్తున్న రైతులు.. నీటికోసం ఎదురుచూస్తున్న పంటలు


చేనులోకి రాత్రి వేళ వచ్చిన పాము


అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలో నీరు లేక నెర్రెలు బారిన వేరుశనగ చేను

అశ్వారావుపేట: పచ్చని పొలాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న అశ్వారావుపేట ప్రాంతాన్ని తెలంగాణ కోనసీమగా అభివర్ణిస్తుంటారు. కానీ ఇక్కడ సాగుకు నీరు లేక.. బోరుకు విద్యుత్ సరఫరా అవ్వక పంటలెండుతున్నాయి. ప్రతి సెంటు భూమికీ గోదారి నీళ్లిచ్చే సంగతేమో గానీ.. బోరు బావులకు విద్యుత్ సరఫరా సరిగా లేక సాగు సన్నగిల్లుతోంది. 2021 వానాకాలంలో జిల్లాలో 5,44,293 ఎకరాల్లో సాగు చేపట్టగా 2022లో 3,16,594 ఎకరాలకు పడిపోయింది. ఏడాదిలోనే 42శాతం తగ్గుముఖం పట్టింది. 2022–23 యాసంగికి 2,15,463 ఎకరాలకు ప్రణాళిక చేయగా కేవలం 1,23,085 ఎకరాలు మాత్రమే సాగులోకి తీసుకురాగలిగారు. లక్ష్యానికి 57శాతం మాత్రమే చేరుకోగలిగారు. సాగు విస్తీర్ణం పెరగకపోవడానికి కారణాలేమైనా.. నీటి లభ్యత లేకపోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. శీతాకాలం ముగిసి యాసంగిలోకి ప్రవేశించక ముందే విద్యుత్ సరఫరా సరిగా లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షల్లో కౌలు, పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేసే రైతులు.. నష్టాలు పాలు కావడానికి ఇది ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

కరెంటు ఎప్పుడిస్తారో తెలీదాయే..

వ్యవసాయానికి 24గంటల నాణ్యమైన విద్యుత్ అని ప్రభుత్వం ప్రగల్బాలు పలుకుతుండగా.. స్థానిక అధికారులు వ్యవసాయ క్షేత్రాల్లోని ఆటోస్టార్టర్‌లను వెతికి వెతికి మరీ తొలగింపజేశారు. మరోవైపు విద్యుత్ కోతలకు అదుపులేకుండాపోయింది. పగలు ఓ 5 గంటలు, రాత్రి మరో 5 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కానీ ఆ 5 గంటలు ఎప్పుడనేది ఎవరికీ అంతు పట్టని రహస్యం. ఒక్క ఆయిల్‌పాంకు తప్ప మిగిలిన పంటలన్నింటికీ ఈ అప్రకటిత విద్యుత్ సరఫరా వల్ల సాగు సరిపడా నీరందని దుస్థితి నెలకొంది. పగటివేళ విద్యుత్ లేక.. రాత్రివేళ పనిచేసేందుకు కూలీలు దొరక్క వేరుశనగ, అపరాల సాగు గణనీయంగా పడిపోయింది.

పాములు, అడవిజంతువులతో ప్రమాదం..

విద్యుత్ అందించడంలో సమయపాలన లేకపోవడం రైతుల ప్రాణాలమీదకు వచ్చింది. అర్ధరాత్రి వేళల్లో కరెంట్ ఇవ్వడంతో పంటల తడికోసం ఆ సమయంలోనూ రైతులు పొలాల బాట పట్టాల్సి వస్తోంది. ఆ టైమ్‌లో పాముల బారిన పడుతున్నారు. అడవి జంతువులతోనూ ప్రమాదం ఉంది. ఫలితంగా రైతులు రాత్రివేళల్లో చేలకు వెళ్లలేకపోతున్నారు. దీంతో పంటలకు నీరు అందక ఎండుముఖం పడుతున్నారు.

లైన్‌మెన్‌లపైనా తీవ్ర ఒత్తిడి..

విద్యుత్ సబ్ స్టేషన్‌లలో ఆపరేటర్లుగా పనిచేసే లైన్‌మెన్‌లు రైతులతోపాటు ఈ సమస్యతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల నుంచి మెసేజ్ రాగానే విద్యుత్ సరఫరా మొదలవుతుంది. మరో మెసేజ్ రాగానే సరఫరా నిలుపుదల చేయాలి. లైన్‌మెన్‌కు ఏ క్షణాన మెసేజ్ వస్తుందో తెలియదు. సరఫరా ఎంతసేపు కొనసాగించాలో తెలియదు. మెసేజ్ రాగానే సదరు లైన్‌మెన్ రైతులతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో మెసేజ్ పోస్టు చేయగానే రైతులు మోటార్లు ఆన్ చేసుకోవాలి. కాకుంటే ఆ మెసేజ్ ఏ క్షణాన వస్తుందో తెలియదు. ఇదంతా సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఉండే సబ్ స్టేషన్లలో ఫర్వాలేదు. కానీ గ్రామీణ ప్రాంతాలు మారుమూల ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లలో సిగ్నల్స్ సరిగా ఉండని చోట లైన్‌మెన్‌లు రాత్రంతా మంచులో, పగలంతా ఎండలో సిగ్నల్స్ ఉండే చోట పడిగాపులు కాయాల్సి ఉంటుంది. ఇంతలో ఏదయినా ఫీడర్‌లో సమస్యలు తలెత్తితే సబ్‌స్టేషన్‌కు పరుగులు పెట్టాల్సి ఉంటుంది.

ఎకరానికి రూ.70 వేలు పెట్టుబడి



ఎకరానికి రూ.70వేలు పెట్టుబడి పెట్టి వేరుశనగ సాగు మొదలు పెట్టాను. కానీ కరెంటెపుడిస్తారో తెలియడం లేదు. రాత్రివేళ పొల్లాలోకి పాములు వస్తుంటాయి. అడవికి దగ్గరలో ఉన్న పొలాల కారణంగా జంతువులు వస్తుంటాయి. నీళ్ల కట్టేందుకు వస్తే ప్రాణాలకే ప్రమాదం. పగటి వేళ కరెంటెప్పుడిస్తారో తెలియటం లేదు.

– కాసగాని కిరణ్‌కుమార్, రైతు, రామన్నగూడెం

దిగుబడి తగ్గింది..



7 ఎకరాల్లో పుచ్చ సాగు చేపట్టగా నీరు సరిగా అందక, విద్యుత్ సరఫరా లేక 6 ఎకరాల్లో దిగుబడి తగ్గి కోసేయాల్సి వచ్చింది. మిగిలిన 1 ఎకరానికి కూడా నీరు సరిగా అందివ్వలేకపోతున్నాం. అధికారులు పగటి విద్యుత్ సరఫరా పెంచితే రైతులు నష్టాల పాలు కాకుండా ఉంటాం.

– గుద్దూరి నరసింహారావు, రైతు, కమలాపురం, ములకలపల్లి మండలం

సమస్య తాత్కాలికమే..

యాసంగిలో వరికి విద్యుత్ వినియోగం అధికంగా ఉండటం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా పవర్‌గ్రిడ్‌పై భారం పడటంతో జిల్లాల వారిగా లోడ్‌ను అంచనా వేస్తూ ఉన్నతాధికారులు విద్యుత్‌సరఫరాను ప్రాంతాల వారిగా మార్చుతుంటారు. వారి ఆదేశాల మేరకు మేం విద్యుత్ సరఫరా చేస్తుంటాం. 24 గంటలు సింగిల్ ఫేస్ ఉంటుంది. త్రీఫేస్ సరఫరా ఎల్లవేళలా ఉండదు. ఇంతకు మునుపులా రైతులకు పరిపూర్ణంగా నాణ్యమైన విద్యుత్‌ను అందజేస్తాం.

– వెంకటేశ్వర్లు, ఏడీఈ, అశ్వారావుపేట

వాలీబాల్ కిట్లు పంపిణీ


కరకగూడెం: క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు


పినపాక: పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కిట్లు అందజేత..

కరకగూడెం: మండలంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం పలు గ్రామాలకు చెందిన యువ క్రీడాకారులకు రేగా విష్ణు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపీపీ రేగా కాళిక, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య వాలీబాల్ కిట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. యువత క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బుడగం రాము, యూత్ ప్రెసిడెంట్ గుడ్ల రంజిత్ కుమార్, సీనియర్ మండల నాయకులు రేగా సత్యనారయణ, రావుల కనకయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

పినపాక: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పినపాక మండలంలోని 23 పంచాయతీలకు చెందిన యువతకు పంపిణీ చేసిన వాలీబాల్ కిట్లను బుధవారం మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. పాయం మాట్లాడుతూ.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 2023 ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉడుముల రవీందర్ రెడ్డి, పేరం వెంకటేశ్వరరావు, కొమరం అర్జున్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సందోహం



దుమ్ముగూడెం: గరిగెలతో మొదటి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర బుధవారం మూడో రోజుకు చేరగా.. భక్త సందోహం నడుమ ఆలయం కిటకిటలాడింది. భక్తులు అందజేసిన పట్టు చీరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ నృసింహ సేవా వాహిని వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి చీర, సారె అందజేశారు. దాతల సాయంతో అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు ఆలయానికి చేరుకున్న భారీ భక్తుల సందడితో అమ్మవారి మొదటి ఉరేగింపును చేపట్టారు. మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో గ్రామంలోని యువకులు ఆడవేశధారణతో అమ్మవారి గరిగెలను తలపై పెట్టుకుని పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఊరేగింపుకు గరిగెలు బయల్దేరే క్రమంలో ఆలయంలోని ధ్వజస్తంభంపైన గల గంటలు మోగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాగనేత్ర ఆర్కెస్ట్రా అంధులచే నిర్వహించిన సంగీత విభావరి భక్తులను కట్టిపడేసింది. సీఐ దోమల రమేష్ పర్యవేక్షణలో ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లను చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చుక్క గణేష్ రెడ్డి అధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

కట్టమైసమ్మ జాతర..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారాయణపురం గ్రామ శివారులోని శ్రీకట్ట మైసమ్మ తల్లి ఆలయంలో బుధవారం నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు. ఈ నెల 12 వరకు జాతర కొనసాగనుంది. బుధవారం జరిగిన జాతరలో సర్పంచ్ కంగాల పరమేష్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, నారాయణపురం సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై నేడు అవగాహన సదస్సు

దమ్మపేట: పామాయిల్ సాగుపై శిక్షణ, అవగాహన సదస్సును నేడు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11:30 గంటలకు మండల పరిధిలోని పట్వారిగూడెం రైతువేదికలో నిర్వహించనున్న ఈ సదస్సుకు వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు హాజరవుతారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం

దమ్మపేట: గత కొద్ది రోజుల కిందట అనారోగ్యంతో కిందపడి గాయాలైన మండలపల్లి గ్రామంలోని ప్రకాష్ నగర్ కాలనీకి చెందిన చింతలచెరువు అంజలికి దిశా కమిటీ సభ్యుడు గారపాటి సూర్యనారాయణ అనురాధ దంపతులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం బాధితురాలిని పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు.

ఎస్సెస్సీ మానిటరింగ్ కమిటీ తనిఖీ

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ స్కూల్లో బుధవారం మండల ఎస్సెస్సీ మానిటరింగ్ కమిటీ తనిఖీ చేసింది. కమిటీ సభ్యులు విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉత్తమ ఫలితాలను సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ టీమ్ లీడర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ బి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

అశ్వారావుపేట: పేరాయిగూడెం పంచాయతీ వార్డు మాజీ సభ్యురాలు కొలికపోగు ఇందిరావతి వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు రామకృష్ణ, కుమార్తె రాజేశ్వరి బుధవారం స్థానిక అమ్మ సేవా సదనంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆనంద్, సిద్ధార్థ పాల్గొన్నారు.

తుమ్మల నివాళులు

బూర్గంపాడు: తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తాళ్లూరి పంచాక్షరయ్య సతీమణి భారతీదేవి మొదటి వర్ధంతిని ఇరవెండిలో బుధవారం నిర్వహించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని భారతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి


అశ్వాపురంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్టీఓ ప్రమీల

అశ్వాపురం: మండల కేంద్రంలో బుధవారం ఆర్టీఓ ప్రమీల ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు, అనుమతి పత్రాలు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

'హాత్ సే హాత్ జోడో' యాత్ర


మామిళ్లవారిగూడెంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని మామిళ్లవారిగూడెం గ్రామంలో బుధవారం టీపీసీసీ సభ్యురాలు, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్రను నిర్వహించారు. గ్రామంలో శ్రీ మల్లేశ్వర స్వామి శివాలయంలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గ్రామంలో గడపగడపకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక తీరును వివరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మా రాంబాబు, మద్దిశెట్టి సత్యప్రసాద్, జుజ్జురు దుర్గారావు, ఎస్‌కే జానీ పాల్గొన్నారు.

నిర్మాణాలను పూర్తి చేయాలి


ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలో నిర్మాణ దశలో ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని బీఎస్పీ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు ఇర్పా రవి రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం బీఎస్పీ నాయకులు రామానుజవరంలోని ఈ ఇళ్లను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూమ్‌లను పూర్తి స్థాయిలో నిర్మించకుండా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పందించి నిర్మాణాలను పూర్తి చేయించాలని, లేనిపక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు పాక వెంకటేశ్వర్లు, నల్లగట్ల రఘు, మండల అధ్యక్షులు పి.మల్లికార్జున్‌రావు, ఇసంపల్లి శివ, సైదులు, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ యాదిలో..


తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమకారులు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు ఓ పోరాట చరిత్ర అని తెలంగాణ ఉద్యమకారుడు ఎస్‌కె.ముబారక్ బాబా అన్నారు. జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ దిండిగల రాజేందర్ ఏపీకి వెళ్తూ.. అశ్వారావుపేటలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆగారు. 2013లో అశ్వారావుపేటలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు, ఆవిష్కరణ ఘట్టాలను వారు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. వారి వెంట కొర్రి వెంకటేశ్వరావు ఉన్నారు.

ప్రమోషన్‌లు ప్రకటించాలి


నినాదాలు చేస్తున్న పండిట్‌లు

మణుగూరుటౌన్: ప్రభుత్వం ఉపాధ్యాయులకు అందిస్తున్న ప్రమోషన్లలో భాగంగా అప్‌గ్రేడ్ చేసిన పండిట్, పీఈటీ పోస్టు ప్రమోషన్‌లు కూడా ప్రకటించాలని టీఎస్ టీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పండిట్ పీఈటీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మణుగూరు జిల్లా పరిషత్ స్కూల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్‌గ్రేడ్ అయిన పండిట్, పీఈటీలకు ఇప్పటివరకు ప్రమోషన్‌లు కల్పించలేదన్నారు. కార్యక్రమంలో పాఠశాల పండిట్‌లు విజయలక్ష్మి, బానోత్ మధుకర్, బానోత్ సురేష్‌లు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవించాలి


కరకగూడెం: గ్రామంలోని చిన్నారులతో సీఐ, ఎస్సై, ఇతర పోలీస్ సిబ్బంది

కరకగూడెం: వలస ఆదివాసీలు ప్రశాంత వాతవరణంలో జీవనం కొనసాగించాలని ఏడూళ్ల బయ్యారం సీఐ రాజగోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన నీలాద్రీపేట గ్రామాన్ని సందర్శించి అక్కడి గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లను అందజేసి వారితో వాలీబాల్ ఆడారు. అలాగే యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కరకగూడెం ఎస్సై జీవన్ రాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

చెత్తాచెదారంతో బ్రిడ్జి



మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌బీఐ సెంటర్‌లో ఉన్న కట్టువాగు బ్రిడ్జి చెత్తాచెదారంతో, మురుగు నిల్వలతో అధ్వానంగా దర్శనమిస్తోంది. ప్రతిరోజు ఎంతో మంది ప్రజలు పలు పనులపై ఎస్‌బీఐ బ్యాంక్‌కు, దుకాణాలకు వస్తూ వెళ్తుంటారు. మురుగుతో నిల్వ ఉన్న బ్రిడ్జి నుంచి వెలువడే దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - మణుగూరురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: మురళి, మున్సిపల్ కమిషనర్, మణుగూరు
ఫోన్ నంబర్: 9849909514

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యూసుఫ్ పాషా - 80083 21148
భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476
ఇల్లందు బి. శేషు - 63052 41411
అశ్వారావుపేట ఎ. దుర్గాప్రసాద్ - 79979 58226
టోల్ ఫ్రీ నెం.: 1800 270 1063

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొందత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416